

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**హైకింగ్ పూర్తిచేసి కారెక్కి** నేను, అన్నయ్య ఇంటికి బయలుదేరాము. రోడ్డుమీద ట్రాఫిక్ అస్సలు లేరు. ఒక్క కారు కూడా పదినిమిషాల పాటు కనబడకపోవడంతో "అన్నయ్య ఇక్కడికి ఎక్కువమంది రారా?" అడిగాను.

"సాయంత్రాలు ఎక్కువమంది ఉంటారు. అందుకే సాయంత్రం ఈ ప్లేస్‌ని అవాయిడ్ చేస్తాను". ఇంకొంచెం దూరం వెళ్ళాక "ఇక్కడ ఒక లోకల్ డైనర్‌లో నేను ప్రతి సాటర్‌డే బ్రేక్ ఫాస్ట్ చేస్తాను. ఇక్కడ ఆగుదామా లేక ఇంటికెళ్ళి తిందామా?" అడిగాడు.

ఇంటికెళ్ళి తినడం అంటే నాతోనే ఇడ్లీ, దోశలు వేయించుకుంటాడా లేక ఫ్రిడ్జ్‌లోవి వేడి చేస్తాడా అని ఆలోచిస్తుండగా, "తొందరగా చెప్పు, టు మినిట్స్‌లో టర్న్ తీసుకోవాలి" అన్నాడు.

"ఇక్కడే తిందాం" వెంటనే అన్నాను.

"గుడ్"

"గుడ్ ఎందుకు? దాంట్లో ఏముంది?" కొంత వెటకారంగా, కొంత అయోమయంగా అడిగాను.

"ఇవాళ్ళ యూ ఎస్.లో నీ ఫస్ట్ డే ఊరు కల్చర్ చూస్తావా లేక ఇంట్లో అమ్మమ్మలా ఉంటావా అని డౌట్ వచ్చింది. మంచి డెసిషనే తీసుకున్నావు" అన్నాడు.

ఆ ఒక్క ప్రశ్నలో ఇంత అర్థం ఉందా? బాబోయ్, అన్నయ్యతో జాగ్రత్తగా ఉండాలి. లోపలికి వెళ్ళాక గబగబా ఏ టేబుల్ ఖాళీ ఉంది అని చూడబోతే అన్నయ్య వెనక్కి లాగి "ఇక్కడ నిలబడు" అని కాస్త గంభీరంగా అన్నాడు.

స్కూల్‌లో ప్రిన్సిపల్ రూం బయట నుంచున్నట్టు బెదురుతూ నుంచున్నాను. మమ్మల్ని పలకరించిన వెయిట్రెస్‌తో "టేబుల్ ఫర్ టు" అన్నాడు. ఆ అమ్మాయి నవ్వుతూ తన వెంట రమ్మంది. కూర్చున్నాక మెన్యూమీద ఉన్న ఫోటోలు కనబడి ఆకలి తెలిసింది. అది తెరుస్తుండగా, "నీకు చాలా విషయాలు నేర్పాలి. లేకపోతే ఇక్కడ ఇబ్బంది పడతావు. నేను ఫస్ట్ వచ్చినప్పుడు నాకు ఎవరూ లేరు. అప్పుడు నాకు తెలిస్తే బావుండు అనుకున్న వన్నీ నీకు నేర్పుతాను. కానీ ఒకటే కండీషన్" అన్నాడు.

"ఏంటి?" ఆసక్తిగా అడిగాను.

"నేను చెప్పేవి జాగ్రత్తగా విను. పొగరుగా 'నాకు తెలుసులే' అనకు. వెక్కిరించడం, ఎగతాళి చెయ్యడంలాంటివి మాను. అమెరికాకి ఫస్ట్ టైం వచ్చావు. నీకు చాలా విషయాలు తెలీవు. కనీసం రెండేళ్ళు ఇక్కడే ఉంటావు కాబట్టి విని నేర్చుకో. నువ్వు యూనివర్సిటీకి వెళ్ళాక చెప్పడానికి నాలా ఎవరూ ఉండరు. సరేనా?" సీరియస్‌గా అడిగాడు.

"సరే అన్నయ్య" భయపడుతూ చెప్పాను.

"నేను నీకు అన్నయ్యని. పరాయి వాడ్నో ఇన్స్ట్రక్టర్నో కాదు. భయపడాల్సిన అవసరంలేదు. నేను చెప్పేది నీకోసమే" అన్నాడు.

తలాడించి మెన్యూ ఓపెన్ చేసాను.

"నేను ఈ 'రైస్ అండ్ షైన్' ఆర్డర్ చెయ్యనా?' అడిగాను.

స్కూల్ టీచర్‌లా పరీక్షించి "లెసన్ నెంబర్ వన్. పేరు చూసి మోసపోకు. అందులో ఏముందో చదువు" అన్నాడు.

"టు పేన్ కేక్స్ విత్ యు ర్ ఛాయిస్ ఆఫ్ సైడ్స్, స్క్రాంబుల్డ్ ఎగ్ ఎండ్ టోస్ట్ విత్ బేకన్ స్ట్రిప్స్" చదివి తెల్లబోయాను.

"అన్నిట్లో ఏముందో కనుక్కుని ఆర్డర్ చేస్తూ ఉండు. లేకపోతే 'నో మీట్' అని చెప్పు" అన్నాడు.

నేను నెక్స్ ఏం సెలెక్ట్ చేస్తా అని అన్నయ్య ఎదురు చూసాడు. స్కూల్‌లో బోర్డ్ మీద మేథ్స్ ప్రాబ్లం సాల్వ్ చేస్తున్నట్టు మెన్యూని బాగా పరీక్షించి "గార్డెన్ ఆమ్లెట్" అన్నాను.

"గుడ్ నేను బ్లూ బెర్రీ పేన్ కేక్స్ అండ్ సన్నీ సైడ్ అప్ చెప్తాను. షేర్ చేసుకుందాం" అన్నాడు.

"ఎంత క్వాంటిటీ వస్తుంది?" అడిగాను.

"లెసెన్ నంబర్ టు. ఇక్కడ ఇండియాలోలా ఓ గిన్నెలో తెచ్చి అందరి ప్లేట్‌లో సర్వ్ చెయ్యరు. ఎవరిది వాళ్ళకే" అన్నాడు కానీ అలా ఎలా అని నాకు మా ఆర్డర్ వచ్చాకే తెలిసింది. తాగేందుకు ఇద్దరం కాఫీ తీసుకున్నాము.

"ఎనీ షుగర్ ఆర్ క్రీం?" వెయిట్రెస్ అడిగింది.

"నో" అన్నయ్య అన్నాడు. వెంటనే ఇద్దరూ నావైపు చూసారు. కాస్త గాబరాపడి నేను కూడా "నో" అన్నాను. ఆ అమ్మాయి వెళ్ళిపోయాక కూడా అన్నయ్య ఆశ్చర్యపోతూ నా మొహం చూసాడు.

"నువ్వు బ్లాక్ కాఫీ ఎప్పట్నించీ తాగుతున్నావే?" వెటకారంగా అడిగాడు.

కిందకి చూస్తూ ఏం మాట్లాడలేదు. వచ్చిన కాఫీ ఒక సిప్ తాగినప్పుడు అన్నయ్య అష్టావంకరలు తిరిగిన నా మొహం చూసి నవ్వాపుకోలేదు.

"చాలా చేదు" నీళ్ళు తాగుతూ అన్నాను.

''క్రీమర్ అంటే పాలకి సబ్స్‌టిట్యూట్. అది, రెండు పాకెట్లు షుగర్ కలుపుకో'' అని వెయిట్రెస్‌ని పిలిచాడు. ఆవిడ వచ్చాక `అడుగు` అన్నట్టుగా సైగ చేసాడు. కాస్త భయపడుతూ `వన్ క్రీమర్ అండ్ టు షుగర్' అన్నాను.

ఆ అమ్మాయి వెళ్ళాక ''కెన్ ఐ హేవ్.. ప్లీజ్.. తనూ మనిషే, రోబో కాదు. నీ ఇంట్లో పనిపిల్ల అనుకుంటున్నావా ఆర్డర్ వెయ్యడానికి?'' కాస్త విసుగ్గా అన్నాడు.

ఇంతలో ఆ అమ్మాయి తిరిగి వచ్చింది.

అన్నయ్యకి సారీ చెప్పి తనకి థేంక్స్ చెప్పాను.

''ఏజ్ సింపుల్ ఏజ్ దట్'' అని అన్నయ్య తినడం మొదలు పెట్టాడు. నేను ఆమ్లెట్ సగం తినేసరికి కడుపు నిండిపోయింది. తిడతాడేమో అని బలవంతంగా తింటుండగా ఓ పేన్ కేక్‌ని నా ప్లేట్‌లో పెట్టాడు. అబ్బా ఇదికూడా ఇప్పుడే తినాలా అని ఓ ముక్క నోట్లో పెట్టుకుని ''బాలేదు'' ఏం తిడతాడో అని భయపడుతూ అన్నాను.

నవ్వి ''సిరప్ వేసుకుంటే బావుంటుంది'' అని దానిమీద ఏదో వేసాడు. దాంతో నంచుకుని తింటే బావుంది కానీ చాలా తియ్యగా ఉంది. నేను కష్టపడడం గమనించి, ''అయిపోయిందా?'' అడిగాడు.

తలూపాను. ఈలోగా వెయిట్రెస్ వచ్చింది.

''చెక్ అండ్ టుగో బాక్స్ ప్లీజ్'' అన్నాడు.

తర్వాత నాకేసి చూసి ''ఇక్కడ బిల్‌ని చెక్ అంటారు మిగిలిపోయింది టుగొ బాక్స్‌లో పెట్టి ఇంటికి తీసుకెళ్ళొచ్చు. తరువాత ఆకలేసినప్పుడు వేడి చేసుకుని తిను'' అన్నాడు.

''లెసన్ నెంబర్ త్రీ'' అని తను అన్న వెంటనే భయపడ్డాను. తిడతాడేమో ఎగతాళి చేస్తున్నా అనుకుంటే ''గుడ్ అటెంషన్ అలానే పే చెయ్యి'' అన్నాడు అన్నయ్య.

కారెక్కగానే ఆవలించాను. ''ఇంటికెళ్ళాక స్నానం చేసి నిద్రపోకు. మెలుకువగా ఉండు'' అన్నాడు.

`సరే` అని కిటికీలోంచి బయట చూస్తూ ప్రకృతిని ఆశ్వాదించాను.

టుగో డబ్బాలని ఫ్రిడ్జ్‌లో పెట్టి స్నానం చేసాక అన్నయ్య ''సినిమా చూద్దామా?'' అన్నాడు.

''డ్రస్ ఛేంజ్ చేసుకుంటా'' అని లోపలికి వెళ్ళబోగా,

''థియేటర్‌కి వెళ్ళికాదే, ఇంట్లో'' నా అజ్ఞానానికి నవ్వాడు.

మోర్టల్ కాంబేట్ లాంటి సినిమాలు ఇష్టపడే అన్నయ్య పరమానందయ్య శిష్యులని పెడితే ఎంతో ఆశ్చర్యపోయాను.

''బ్లాక్ అండ్ వైట్ సినిమా బోర్'' అని చెప్పి చూసాను.

''ఇది బావుంటుంది. నువ్వు నవ్వుతావు'' ఒప్పించాడు.

అన్నయ్య చెప్పినట్టే సినిమా చూస్తున్నంతసేపూ ఎంతో నవ్వుకున్నాము.

''నీకు వంట నేర్పిస్తా'' అన్నాడు.

''నాకు నువ్వు నేర్పిస్తావా?'' వెటకారంగా అన్నాను.

''ఇండియా వంటలు నీకొచ్చు, ఇక్కడివి నాకొచ్చు'' అని కన్నుకొట్టాడు.

స్టవ్ ఎలా ఆన్ చెయ్యాలి, ఏ నీళ్ళు వాడాలి, ఓవెన్ ఎలా వాడాలి వంటివి నేర్పి, ''ఉత్తపప్పు, ఆవకాయ, బెండకాయ కూర తినాలనుంది నేను రైస్ కుక్కర్ పెడతా, నువ్వు పప్పు, బెండకాయకూర చేస్తావా?'' అడిగాడు.

"చేస్తాలే. ఈజీనే. బెండకాయలు, ఉల్లిపాయలు, టమాటో, పచ్చిమిరపకాయలు, తిరగమోత సామాన్లు ఎక్కడ ఉన్నాయి? అడిగాను.

"బెండకాయ ఫ్రై చెయ్యి" అని పప్పుడబ్బా, నూనె బాటిల్, ఫ్రోజెన్ బెండకాయలిచ్చాడు.

"ఆల్మోస్ట్ మర్చిపోయా. బెండకాయలని ముందు మైక్రోవేవ్‌లో హీట్ చెయ్యి. లేకపోతే డైరెక్ట్ నూనెలో వేసేవు" అన్నాడు.

రోజూ అమ్మని ఇది చెయ్యి, అది చెయ్యి అంటే ఇలానే ఫీలయ్యేదేమో పాపం. నేను కష్టపడి వంట చేస్తుంటే అన్నయ్య మాత్రం లేప్‌టాప్ ఓపెన్ చేసి కూర్చున్నాడు. వంట ఆల్మోస్ట్ అయిపోవచ్చినప్పుడు లేప్‌టాప్ మూసి నాతో మాట్లాడ్డం మొదలు పెట్టాడు.

"నేను ఫస్ట్ టైం వచ్చినప్పుడు ఎయిర్ పోర్ట్ నుంచీ యూనివర్సిటీలో ఇండియన్స్ ఇద్దరు నన్ను పిక్ చేసుకున్నారు. టెంపరరీ అకామడేషన్ అని ఇద్దరు హిందీ వాళ్ళతో ఉంచారు. వాళ్ళు అస్సలు ఫ్రెండ్లీ కాదు. ఇంటికి ఫోన్ చేసుకుంటా అంటే తిట్టుకుంటూ ఫోన్ ఇచ్చారు. మాట్లాడినంత సేపు వాచ్ చూస్తూనే ఉన్నారు. ఫోన్ పెట్టాక ఫోర్టీన్ డాలర్లు తీసుకున్నారు నానుంచి. ఫుడ్ కూడా షేర్ చెయ్యలేదు. రోజూ ఎప్పుడు వెళ్తున్నావు అని పదిసార్లు అడిగారు. పడుకోడానికి దుప్పటి కూడా ఇవ్వలేదు. అలా నాలుగు రోజులు గడిచాక వేరే స్టూడెంట్స్‌తో కలిసి ఇల్లు మారాను. ఆ ఫోర్ డేస్‌కి వాళ్ళు నన్ను రెంట్ పే చెయ్యమన్నారు. సెమిస్టర్ ఫీజ్‌లోంచి కట్టాల్సి వచ్చింది. అదృష్టవశాత్తూ నా రూమ్మేట్ హెల్ప్ చేసాడు. ఫీజ్ కట్టేందుకు. తనకి నేను డబ్బు తిరిగి ఇచ్చాను కానీ ఈరోజుకీ రుణపడే ఉన్నాను. అమ్మా, నాన్న బాధపడతారని వాళ్ళకి ఈ విషయాలు నేను చెప్పలేదు. నువ్వు కూడా చెప్పకు. నీకు ఎందుకు చెప్తున్నానంటే నువ్వు ప్రిపేర్ అవుతావని. హోప్ ఫుల్లీ నీకు మంచివాళ్ళే దొరకాలి. కానీ ప్రిపేర్డ్‌గా ఉండు. నన్నైతే వాళ్ళు అన్ టచ్‌బుల్స్‌లానే ట్రీట్ చేసారు. అందుకని నీకు ఓ వారం రోజులకి సరిపడా ప్రోటీన్ బార్స్, ట్రావెల్ సైజ్ షాంపూ, టూత్ పేస్ట్, మిగిలినవన్నీ కొనిస్తా. అవేవాడు. వాళ్ళు నీవేమైనా తీసుకుంటే గొడవపడకు. చూసీ చూడనట్టు వదిలెయ్. కానీ నువ్వు మరీ అవసరమైతే మాత్రం వాళ్ళవి అడిగిన తరువాతే వాళ్ళది వాడు. కుదిరినప్పుడు వాడింది తిరిగిచ్చే ప్రయత్నం చెయ్యి"

అన్నయ్య చెప్పేసరికి నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఇప్పుడు బానే ఉన్నాను. ఏడవకు. అయినా నా గురించి ఏడుస్తున్నావా, లేక నీకెలా ఉంటుందో అని ఏడుస్తున్నావా?" ఎగతాళి చేసి నవ్వాడు.

నేను సమాధానమివ్వకపోయేసరి "ఆకలేస్తుందే, తిందాం పట్టు. సాయంత్రం నిన్ను వాల్‌మార్ట్‌కి తీసుకెళ్ళి కావాల్సినవి కొనిపెడతా. రాత్రి డిన్నర్ బయట చేద్దాం" అన్నాడు.

నేను ఇంకా దిగులుగా ఉండడం గమనించి, "మహాలక్ష్మి అత్తయ్య మహాతల్లిలానే ఉందా లేక ఏమైనా మారిందా?" అంటూ గాసిప్స్‌తో నా మూడ్‌ని మార్చాడు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story